


# ఉదయం

యర్రమిల్లి జె. శేఖరం

**2088** డిసెంబరు 31వ తేది.

అది 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (IISRAD)' కార్యాలయం, ముప్పైఆరో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాలు.

అన్ని ప్రముఖ దేశాల ప్రధాన కార్యదర్శులు ఆ సమయంలో అక్కడ సమావేశమై ఉన్నారు. వాళ్ళ ఎదురుగావున్న మానిటర్ స్క్రీన్ మీద, ఇంటర్ ప్లానిటరీ రీసెర్చ్ రాకెట్ ఎ-1 (IPRR A-1) తొమ్మిదో గ్రహమైన ప్లూటో మీదకి దిగటం త్రీ-డీలో కనబడుతోంది.

అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

ప్లూటో ఉపరితలం మీద IPRR A-1 నెమ్మదిగా దిగింది।

మరుక్షణం ఆ గది చప్పట్లతోను,

'కంగ్రాట్యులేషన్స్' అన్న అరుపుల తోటి మారుమోగింది.

మనిషి మరో విజయ పతాకం పాతాడు.

అదే సమయంలో ఎవరో పిచ్చివాడు అదేపనిగా నవ్వడం ప్రారంభించాడు.

## కథారంభం

అది జరిగిన కొద్ది సేపటికి పాషా, తన 'గార్గా త్రీ-థౌజండ్' మీద విను వీధుల్లో రివ్వున సాగిపోతున్నాడు.

ప్రస్తుతం వున్న స్పేస్‌షిప్స్ అన్నిట్లోకి గార్గా త్రీ-థౌజండ్ ఒక్కటే టు సీటర్, అతి చిన్నదీను. ప్రస్తుతానికి తన కొక్కడికీ ఇది సరిపోతుంది. మాయావి వివాహం చేసుకున్న తరువాత ఆరుగురికి సరిపోయే 'ట్రబుల్ డబుల్' కొనాలని ఆలోచిస్తున్నాడు ముందు ముందు ప్రభుత్వానుమతితో పుట్టబోయే బిడ్డకు కూడా అద్దైతే వీలుగా ఉంటుంది. అప్పుడు మాయావి చంద్రుడి మీద దింపేసి తను శుక్రుడిమీద కొచ్చేయొచ్చు.

పాషా వెళ్ళేదారికి అటూ ఇటూ వరుసగా పెటిలైట్లు కాంతివర్షం కురిపిస్తున్నాయి. దారంతా వెలుగులు చిమ్ముతోంది. ట్రాఫిక్ రూల్స్‌ని పాటిస్తూ, జాగ్రత్తగా తన గార్గాని నడుపుతున్నాడు చాల కఠినమైన పరీక్షల అనంతరంగాని వాన వీధుల్లో వాహనాలు నడపడానికి లైసెన్సు ఇవ్వరు. అతని స్పేస్‌షిప్‌ని ఏ పరిస్థితులలోనూ అతను బాగుచేసు కోగలిగి ఉండాలి. అలాంటివారికే ఈ లైసెన్సు ఇవ్వబడుతుంది. పాషా దార్కి వార్ ర్యాలీలో ఒకసారి ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు కూడాను.

2030 నాటికే భూమిమీద వాతావరణం పూర్తిగా కలుషితమయిపోయింది. ఫ్యాక్టరీల నుండి వచ్చే వేడికి, పొగలకి విధవిధాలయిన రసాయనిక చర్యలవలన వచ్చే మార్పులకు వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ నిష్పత్తులు అధికమవడంతో ఉష్ణోగ్రత పెరిగి నీటికొరత ఏర్పడింది. అనంతవిశ్వంలో భూమి సజీవపాత్ర ముగిసే దశ వచ్చిందని శాస్త్రజ్ఞులు భయపడిపోయారు.

పాషా చిన్నగా నవ్వుకున్నాడు. మనిషి మేధస్సును భగవంతుడనేవాడు తక్కువగా అంచనా వేశాడు. మళ్ళీ మనిషే గెలిచాడు.

ఆక్సిజనట్స్, కాంపాక్ట్ సెల్ కనుక్కోబడ్డాయి.

ఆక్సిజనట్స్ అవతరించడంతో ఇతర గ్రహాలలో — మరీ కార్బన్ డై ఆక్సైడ్ పొగలతోటి, మంచుగడ్డలతోటి ఉండే గ్రహాలతో సహా, వాతావరణ నిష్పత్తులని సూర్యుడి నుంచి ఆయా గ్రహాల దూరాలకు అనుగుణంగా మార్పడం జరిగింది.

నివానికి చంద్రుడనే ఉపగ్రహమూ, శుక్రగ్రహమూ నివాసయోగ్యంగా

చూపుదిద్దుకున్నాయి అయితే భూమి మీదలా చొక్కా విప్పుకుని తిరగడానికి లేదు. ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన సూటు వేసుకొనే ఉండాలి.

ఆక్సిజన్ మాస్క్‌తో సహా.

ఆక్సిజన్ సిలెండర్లని మోసే బాధ కూడా తప్పింది. ఓ ప్రముఖ కెమికల్ కంపెనీ ఆక్సోజనట్స్‌ను మాత్రలుగా చేసి 'ఆక్సోటిక్స్' అనే పేరుతో విడుదల చేసింది. ఆ ఆక్సోటిక్స్ ఒక డజను జేబీలో వేసుకుని పోతే ఒక వారందాకా ఆ ఆక్సోటిక్స్ అన్నీ పూర్తిగా కరిగి పోయేదాకా బెంగలేదు.

పాషా సూటులోపలి చొక్కా జేబులో తడుముకున్నాడు. గుండె దిగ్గుమంది. సాధారణంగా రెండు డజన్ల ఆక్సోటిక్స్‌ను మరచిపోకుండా తెచ్చుకుంటాడు. కాని ఇప్పుడు ఒకే ఒక ఆక్సోటిక్ ఉంది జేబులో. అయినా ఫరవాలేదు. రెండు మూడు గంటల్లో తిరిగి భూమిమీదకు వెళ్ళిపోతాడు తను.

కుడిచేత్తో స్పేస్‌షిప్ వేగాన్ని పెంచే లీవర్ని బలంగా లాగాడు. గార్గా త్రీ-థౌజండు గుర్రుమంటూ వేగంగా ముందుకు దూకింది.

రెండు ప్రక్కలా వెలుగులు చల్లుతున్న పెటిలైట్స్, వేగంగా వెనక్కు కదిలిపోతున్నాయి.

తనలో తనే నవ్వుకుంటూ పాషా బ్యాటరీ క్యాబిన్‌వైపు ఆప్యాయంగా చూసాడు.

అసలు ఆక్సోజనట్స్ కన్న ముఖ్యంగా చెప్పుకోవలసింది 'కాంపేక్ట్ పవర్ సెల్' ఎంత చిన్నదంటే, దాని మొత్తం పరిమాణం ఒక సాధారణమైన మనిషి అరచెయ్యంత. అయితే దాని శక్తి 1969–2001ల మధ్య లాంచ్ చెయ్యబడ్డ రాకెట్ల మొత్తానికి సమానం. అందువల్లనే చిన్నచిన్న గార్గా త్రీథౌజండ్‌లాటి టు పీటర్లు కూడ అతి సునాయాసంగా శుక్ర గ్రహానికి పొద్దున వెళ్ళి సాయంకాలం రాగలుగుతున్నాయి.

మానవుడి మేధను తలుచుకొన్నకొద్దీ పాషాకు ఎంతో గర్వంగా అనిపించింది.

పాషా ఆలోచిస్తున్నవాడల్లా, ఎదురుగా రెడ్ పెటిలైట్ కనబడేసరికి ఉలిక్కి పడ్డాడు.

రెడ్ పెటిలైట్స్ అనేవి, దారిలో ఏమైనా అవాంతరాలు ఉన్నా లేక స్పేస్‌షిప్ వెళ్ళేదారి తప్పుదారయినా ఎదురు పడే పెటిలైట్స్.

అతడు గార్గా త్రీథౌజండ్‌ని నెమ్మది చెయ్యడానికి బ్రేక్ లీవర్‌ని బలంగా లాగాడు. గార్గా వెళ్ళే వేగం కొంత తగ్గింది. అయినా అతనికి తెలిసి పోయింది, తను తిన్నగా వెళ్ళి రెడ్ పెటిలైట్‌కి గుద్దుకోవడం తథ్యం. అంతే. ఇంకేముంది–?

గార్గాని సత్వరం ఎడమ చేతివైపు తిప్పాడు.

కొంతదూరం అదే వేగంతో వెళ్ళిన గార్గా త్రీథౌజండ్ దేనికో గుద్దుకున్నట్టు టక్కున ఆగిపోయింది. లోపల బయట అంతా అంధకారం. కాలు దేనికో గుద్దుకుని విరిగిపోయినంత బాధ పెట్టింది. చేత్తో తడిమి చూశాడు.

స్పేస్‌సూట్ అడ్డుకుంది అదీ ఒకందుకు మంచిదే. ఎనుక విరిగినా కాలుని ఒకే విధంగా పట్టి ఉంచుతుంది.

కాలుని వెనక్కి లాగడానికి శరీరాన్ని వెనక్కి జరిపి ప్రయత్నం చేశాడు. కళ్‌మని నొప్పి గుండెల్లోకి తన్నింది. ఆ ప్రయత్నం విరమించుకుని దీపం వెయ్యడానికి స్విచ్‌లు నొక్కసాగాడు.

ఒక్క దీపమూ వెలగలేదు.

అతను దాని గురించి కంగారు పడకుండా సవ్యసాచిలా పనిచేసేస్తున్నాడు. అతనికి క్షుణ్ణంగా ఏ స్విచ్, ఏ బటన్ ఎక్కడుందో తెలుసు. భయంలేదు

అతను ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తూ, ఆలోచించసాగాడు.

తను కూర్చున్న గార్గా త్రీ-థౌజండ్ తనచుట్టూ తాను ప్రదక్షిణాలు చెయ్యకుండా స్థిమితంగా ఒకేచోట ఉందంటే తాను ఏదో ప్లానెట్‌మీద ఉన్నాడన్న మాట. నిశ్చయంగా ఆ గ్రహం శుక్రుడు కాదు. భూమి ఉపగ్రహమైన చంద్రుడూ కాదు. ఎందుకంటే ఆ రెండుచోట్లా ప్రజావాహిని గలగలలాడుతూ, బిగుతైన స్పేస్ సూట్లతో, దీపాల వెలుగులో తిరుగుతూంటుంది. కనుక ఇది వేరే గ్రహం, ఇంకా సాగుబడికిరాని గ్రహం.

అయినా అతనికి చింతలేదు. గార్గా త్రీ-థౌజండ్‌లోని ప్రతి భాగం స్క్రూ నట్లతో సహా తనకి తెలుసు. చీకట్లో నయినా తడుముకోకుండా తను దీన్ని మరమత్తు చేసెయ్యగలడు

అతడు చకచక ఒక పద్ధతి ప్రకారం పని చేసుకుపోతున్నాడు. కాలు విపరీతంగా బాధపెడుతోంది. అయినా అతడు పట్టించుకోకుండా తన పని చేసుకుపోతున్నాడు.

ఇంతలో ఏదో గుర్తొచ్చినవాడిలా టక్కున ఆగాడు-

ఒళ్ళు ఒక్కసారి జలదరించింది. చేతిలో ఒకే ఒక్క అక్సిజన్ ఉంది!

అది కరిగిపోయిన కొద్ది సేపటిలో ఊపిరి అందక గిలగిల కొట్టుకుని....

అతడు తల విదిలించి ప్రస్తుతానికి వచ్చి ముందుకన్నా వేగంగా చేతులతో తడుముకుంటూ పనిచేయడం ప్రారంభించాడు.

రెండు గంటల తీవ్రమయిన పరిశ్రమ తరవాత స్పేస్‌షిప్ గార్గా త్రీ-థౌజండ్ గాలిలోకి లేచింది.

పాషా చేతులు ఒణుకుతున్నాయి. ఇంకో పదినిముషాలలో కనుక తను భూమిని చేరుకోకపోతే ఇవే తనకు చివరి నిముషాలు- అని తెలిసిపోయింది.

చేయి తడుముకు చూసుకున్నాడు.

ఆక్సిజన్ పూర్తిగా కరిగిపోయింది. మహా అయితే ఇంకో అయిదునిముషాల పాటు అతనికి సరిపోతుంది

అతను ఒక్కసారి ఊపిరి పీల్చుకుని ఎంత సేపు వీలయితే అంత సేపు వదిలి పెట్టకుండా ఊపిరి బిగబట్టి విశ్వసించటం ప్రారంభించాడు. ఇలాగయితే కొంత సమయం ఆదా చేయవచ్చునని అతని ఉద్దేశ్యం

గార్గా వేగంగా వినువీధుల్లో పయనిస్తోంది.

చుట్టూ దట్టమయిన చీకటి, నక్షత్రాలు. ఎక్కడో మినుకుమినుకు మంటున్నాయి. అతను ఉఛ్వాసనిశ్వాసాల పద్ధతి ప్రకారం చేస్తూనే ఉన్నాడు. క్షణాలు దొర్లిపోతున్నాయి

నక్షత్రాలు సీరియల్ సెట్లో బల్బుల్లా ఆరి ఆరి వెలుగుతున్నాయి బాధ మరిచిపోవడానికి సన్నగా మనసులో పాడుకోవడం ప్రారంభించాడు.

'చుక్కల్లో చుక్క! చక్కని చుక్క!
మిలమిల తారక్క, వయ్యారి మొలక!
జాబిలేదే అక్క, అవక్క ఈ వక్క'

ఠక్కున మనసులో పాట ఆగిపోయింది.

అవును. ఏదీ చందమామ?

Where is the Moon?

అతనికి స్పృహపోయినంత పని అయింది. మానిటర్ స్క్రీన్ ఆన్ చేసి చూసాడు. అంతటా నక్షత్రాలు మిణుక్కు మిణుక్కుమంటున్నాయి.

తను దారితప్పి ఎక్కడికో పోతున్నాడా? ఇంకో గ్రహాన్ని కనుక్కుంటే నోబెల్ బహుమతిస్తారు. తన-ఓ గాడ్! బహుమతినందుకోవడానికి తనకి పెళ్లాం పిల్లలన్నా లేరే!!

గార్గాని తనచుట్టూ తనని గిరికీలు కొట్టించాడు అదిగో అక్కడ బ్లూ డైమండ్‌లా మెరుస్తూ... భూమిని కనుక్కోగలిగితే, అక్కడే చంద్రుడంటే పెట్టుకుంటాడు.

గార్గా త్రీ-థౌజండ్‌ని ఆ దిశగా పరుగులు తీయించాడు

బిగిసిన కాలు విపరీతంగా నొప్పి పెడుతోంది ఊపిరి తీసుకోవడం మరీ కష్టంగా ఉంది

క్షణాలు దొర్లిపోతున్నాయి

వేగంగా!

## ఉపసంహారం

ఎంత సేపు గడిచిందో తెలియదు.

సాషాకి తలమీద ఉన్న ఆక్సిజన్ మాస్క్ చింపెయ్యాలనే కోరిక బలంగా ఉంది. గాలి అందక ఊపిరితిత్తులు బద్దలయేలా ఉన్నాయి. అతనెంతో నిగ్రహంగా ఉండాలని ప్రయత్నిస్తున్నాడు.

ధడ్ మనే చప్పుడుతో ఆగింది స్పేస్‌షిప్-గార్గా త్రీ-థౌజండ్

చివరి క్షణాలు లెక్కపెట్టుకుంటున్న సాషా నెమ్మదిగా కళ్ళు తెరిచి స్క్రీన్ వంక చూసాడు

వెంటనే పిడుగులు పడ్డట్టుగా గట్టిగా అరిచి తన తలమీద ఉన్న ఆక్సిజన్ మాస్క్ చింపి పారేసాడు. అదే చేత్తో తన శరీరాన్ని అంటిపెట్టుకొని ఉన్న స్పేస్‌సూట్‌ని తీసివేసాడు.

ఇదే అతను కొద్ది సెకన్ల ముందుగా చేసి ఉంటే, అతని శరీరం 'ముక్కలు' స్పేస్‌షిప్‌తో సహా స్వర్గానికి చేరుకునేవి.

విరిగిన కాలు విపరీతమైన బాధ పెడుతోంది. అయినా అతడు లెక్క చెయ్యలేదు.

అతనికి తెలుసు

గార్గా త్రీ-ఫౌండు తలుపు ఒక్క తన్నుతో తెరుచుకుంది

పాషా తన ఆరడుగుల మూడంగుళాల శరీరంతో గార్గాలోంచి క్రిందకు గెంతాడు

బూట్లులేని కాళ్ళకి చల్లటి ఇసుక హాయిగా తగిలింది. ఇంకా ఇంకా తన శరీరాన్ని ఆ ఇసుకలోకి నొక్కుకున్నాడు గుప్పెడు ఇసుక తీసుకుని నెత్తిమీద పోసుకున్నాడు.

ఒక్కసారి మనసంతా తేలికయి నిద్రపోవాలన్నట్టు కళ్ళు మూసుకుపోతున్నాయి.

ఎదురుగుండా సముద్రం తెల్లటి పావురాల రెక్కల్లాంటి నురగల కెరటాలతో ఎప్పుడూ ఎగిరిపోతుండే నీలాల సాగరం.

అమావాస్య ముగిసి అప్పుడే తెల్లవారబోతున్నట్లుంది. ఏదో గూట్లోంచి చిన్న పిట్ట కిచకిచమని అరుస్తోంది. తెలుపునలుపుల కలనేత ఆకాశం బ్యాక్ గ్రౌండ్‌లో కొబ్బరాకు పెచ్చిలు గీతల్లా కదులుతున్నాయి.

సముద్రం ఆకాశం కలిసేచోటు నుంచి నిద్దుర లేచిన సూర్యుడు ఎర్రని ముఖంతో పైకొస్తున్నాడు. రేగిన జుట్టులా కిరణాలు ఆకాశమంతా పరుచుకుంటున్నాయి.

తల కింద చేతులు పెట్టుకుని అతను ఆకాశం వంక చూస్తూ వెల్లకిలా పడుకున్నాడు

మనిషి తెలివితేటల మీద అతడికి ఇప్పుడు నమ్మకం పోయింది.

పూర్తిగా.

